సాక్షి పశ్చిమగోదావరి

శుక్రవారం : 2 : మే : 2025



ఎన్‌సీసీ శిక్షణ.. ఉన్నతికి నిచ్చెన

పెదవేగి మండలం పినకడిమిలో ఆర్మీ బెటాలియన్ కల్నల్ అమిత్ పాండే ఆధ్వర్యంలో ఎన్‌సీసీ శిక్షణ ఉత్సాహంగా సాగుతోంది.

8లో ▸



శీతల పానీయాలతో జాగ్రత్త!

ఎండలు తీవ్రమవుతున్న క్రమంలో ప్రజలు కూల్‌డ్రింక్స్ తాగడం ఆరోగ్యానికి హాని కరమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

8లో ▸



వేసవి క్రీడా శిబిరాలు ప్రారంభం

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం జిల్లావ్యాప్తంగా 50 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి.

8లో ▸

బలవంతపు సమీకరణ

బస్సులు లేక.. ప్రయాణాలు సాగక..

- ప్రధాని సభకు భారీగా జన సమీకరణ
- కూలీలు, మహిళలు, రైతులే లక్ష్యం
- రాకుంటే తీవ్ర పరిణామాలంటూ అధికారుల హెచ్చరికలు
- ఉమ్మడి జిల్లా నుంచి 720కి పైగా బస్సుల ఏర్పాటు
- గురువారం సాయంత్రం నుంచే బస్టాండ్లు ఖాళీ
- బస్సులు లేక ప్రయాణికుల అగచాట్లు



ఏలూరు నుంచి అమరావతి సభకు వెళ్లేందుకు సిద్ధం చేసిన బస్సులు



బస్సులు లేక నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద ప్రయాణికుల బారులు



ఏలూరు బస్టాండ్‌లో బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఉపాధి పనులు కావాలంటే అమరావతి రావాల్సిందే.. డ్వాక్రా గ్రూపులు సజావుగా సాగాలంటే ప్రధాని సభకు వచ్చి తీరాల్సిందే.. రైతులకు ప్రభుత్వ పథకాలు అందాలంటే తప్పనిసరిగా రావాలి.. ఇలా గ్రామానికి 200 మందిని తీసుకువెళ్లాలని టార్గెట్ పెట్టారు.. మీరెవ్వరూ రాకపోతే మీ ఎమ్మెల్యేలు కోప్పడతారు.. తర్వాత తీవ్ర పరిణామాలు ఉంటాయి.. అంటూ ఊళ్లల్లో హెచ్చరికలు చేసి మరీ జన సమీకరణకు సర్కారు నానా తంటాలు పడుతోంది. శుక్రవారం అమరావతిలో జరిగే ప్రధాన మోదీ బహిరంగ సభకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి లక్ష మందిని సమీకరించాలని ప్రభుత్వం టార్గెట్ నిర్దేశించడంతో గ్రామస్థాయి కార్యదర్శి మొదలు కలెక్టర్ వరకూ అందరూ సమీకరణ హడావుడిలో నిమగ్నమయ్యారు. మండుటెండలో అంత దూరం వచ్చి ఇబ్బందులు పడలేమంటూ ప్రజలు తిరస్కరించినా వచ్చి తీరాల్సిందేనని హుకుం జారీ చేసి మరీ తీసుకువెళ్లడానికి సన్నాహాలు చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి ఆర్టీసీ బస్సులు 220, ప్రైవేట్ ట్రావెల్స్, స్కూల్ బస్సులు 500 ఏర్పాటు చేశారు. వీటితో పాటు జిల్లావ్యాప్తంగా 600 కార్లను తరలింపునకు సిద్ధం చేశారు.

కలెక్టర్ల పర్యవేక్షణలో..

అమరావతిలో శుక్రవారం మధ్యాహ్నం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న బహిరంగ సభకు ప్రధాని మోదీ హాజరవుతున్నారు. ఈ క్రమంలో భారీ జనసమీకరణతో హడావుడి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించి పొరుగు జిల్లా కావడంతో ఉమ్మడి పశ్చిమ నుంచి భారీగా జనాలను తరలించడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించడం, నియోజకవర్గాల వారీగా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి భారీగా తరలిరావాలంటూ పిలుపునిచ్చారు. అధికారిక కార్యక్రమం కావడంతో పూర్తి బాధ్యతలు జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. జనసమీకరణ మొదలు వాహనాల ఏర్పాట్ల వరకు అన్ని పనులను కలెక్టర్లు పర్యవేక్షిస్తున్నారు.

బస్సుకో ఇన్‌చార్జి

జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి ఉపాధి హామీ కూలీలు, డ్వాక్రా మహిళలు, రైతులు, వివిధ రకాల చేతివృత్తులు చేసుకుంటున్న వారిని ప్రధానంగా గ్రామాల వారీగా ఎంపిక చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి 30 వేలకు మందికి తగ్గకుండా వీరినే తీసుకురావాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో కలెక్టర్ ఆదేశాలతో ఎంపీడీఓలు ప్రతి గ్రామంలో 45 మందిని తరలించడానికి వీలుగా ప్రతి బస్సుకు ఇన్‌చార్జిని ఏర్పాటుచేశారు. ఏలూరు జిల్లాలో ఏలూరు, కైకలూరు, దెందులూరు, చింతలపూడి నుంచి మండలానికి 20 నుంచి 25 బస్సులు, దూరం ఉన్న నియోజకవర్గాల నుంచి 10 నుంచి 15 బస్సులు ఏర్పాటు చేసి ఉదయం 8 గంటకల్లా అందరినీ సమీకరించుకుని బయలుదేరి గన్నవరంలోని సిద్ధార్థ మెడికల్ కళాశాల వద్ద 11 గంటలకు భోజనాలు పెట్టి మధ్యాహ్నం ఒంటి గంటకల్లా సభలో కూర్చొపెట్టి ప్రతిచోటా ఫొటోలు తీసి కలెక్టర్ పేషీకి పంపాలని ఆదేశాలు ఇచ్చారు. ఇక మనిషికి రూ.90లు బడ్జెట్ కేటాయించి దానిలో రెండు అరటిపండ్లు (రూ.12), రెండు వాటర్ బాటిళ్లు (రూ.18), ఉదయం పెట్టే పులిహోర ప్యాకెట్ (రూ.60) చొప్పున ఖర్చు పెట్టాలని అధికారులు ఆదేశించారు.

ఆర్టీసీ బస్టాండ్ ఖాళీ

ఉమ్మడి జిల్లా నుంచి 220 ఆర్టీసీ బస్సులను గురువారం సాయంత్రం 5 గంటలకే అమరావతి సభ పేరుతో తరలించారు. ఇక జిల్లా రవాణా శాఖ ద్వారా ప్రైవేట్, స్కూల్ బస్సులు, ట్రావెల్ బస్సులు కూడా పూర్తిగా రప్పించి గ్రామాలవారీగా రూట్లు నిర్ణయించి పంపారు. దీంతో గురువారం సాయంత్రం నుంచే ఏలూరులో ఆర్టీసీ బస్టాండ్ తీవ్ర ప్రయాణికుల రద్దీతో కిటకిటలాడుతుంది. ఒక్క బస్సు కూడా లేకుండా బస్టాండ్ ఖాళీగా ఉండటంతో కొంత గందరగోళం రేగింది. జిల్లావ్యాప్తంగా రెవెన్యూ, వైద్యారోగ్య శాఖ, పంచాయతీరాజ్ శాఖల్లో 90 శాతం మందికిపైగా ఉద్యోగులకు ప్రధాని సభకు సంబంధించిన విధులు కేటాయించారు. అలాగే 80 శాతం మంది పోలీసులను బుధవారం నుంచే బందోబస్తుకు కేటాయించారు.



బస్టాండ్‌లో బిడ్డతో ఓ తల్లి అవస్థలు

న్యూస్‌రీల్

పోషకాహారం అందించాలి



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి సూర్యకుమారి

భీమవరం అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించాలని, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమం, దివ్యాంగులు, వృద్ధుల శాఖ సెక్రటరీ, జిల్లా ప్రత్యేకాధికారి ఎ.సూర్య కుమారి అన్నారు. మండలంలోని చినఅమిరం –3 అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. కేంద్రాన్ని పరిశీలించి పిల్లలతో ముచ్చటించారు. పిల్లలందరినీ తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రానికి పంపేలా తల్లులను ప్రోత్సహించాలన్నారు. కేంద్రం ఆవరణలోని ఖాళీ స్థలంలో ఆకుకూరలు పండించి పిల్లలకు వండి పెట్టాలని సూచించారు. సీడీపీఓ టీకేవీ సూర్య కాంతం, సూపర్‌వైజర్ డి.అనిల్‌కుమార్ ఉన్నారు.

ఆక్వా చెరువు తవ్వకం ఆపాలి



సర్పంచ్‌కు సమస్య చెబుతున్న మహిళలు

కాళ్ల: ఏలూరుపాడులో మంచినీటి చెరువుకు సమీపంలో ఆక్వా చెరువు తవ్వకాన్ని వెంటనే నిలుపుదల చేయాలంటూ గురువారం గ్రామస్తులు ఆందోళన చేశారు. పంచాయతీ కార్యాలయానికి పెద్ద ఎత్తున చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం సర్పంచ్ భూపతిరాజు వెంకట జగ్గరాజు ఇంటికి వెళ్లి చెరువు తవ్వకంపై గళమెత్తారు. తమ ఆరోగ్యాలు కాపాడాలంటూ నినదించారు. చెరువు తవ్వకానికి సిద్ధమవుతున్న రైతుతో సర్పంచ్ జగ్గరాజు ఫోన్‌లో మాట్లాడారు. రెండురోజుల పాటు తవ్వకం పనులు నిలిపివేయాలని సూచించారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి



దారపు బండి చుడుతున్న కలెక్టర్ నాగరాణి

అత్తిలి: స్వయం సహాయక సంఘాల మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు యూనిట్ల స్థాపనకు ముందుకు రావాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. గురువారం మండలంలోని అత్తిలి, మంచిలి గ్రామాల్లో మహిళా సమాఖ్య సభ్యులు నిర్వహిస్తున్న ఉపాధి యూనిట్లను ఆమె పరిశీలించారు. మంచిలిలో పూతరేకుల యూనిట్లను నిర్వహిస్తున్న మహిళలతో ఆమె మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా నిలిచేందుకు ప్రభుత్వం రుణాలు అందిస్తోందన్నారు. అనంతరం అత్తిలిలో శరవణ గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్, పేపర్ ప్లేట్స్, స్వీట్స్ బాక్స్ తయారీ యూనిట్లను ఆమె సందర్శించారు. కామధేను త్రెడ్స్ (దారపు బంతుల తయారీ యూనిట్), అనూష బొటిక్ అండ్ మగ్గం వర్క్స్, టైలరింగ్ యూనిట్‌ను పరిశీలించి మహిళలకు సూచనలు ఇచ్చారు. డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్‌ఎన్ వేణుగోపాల్, లైవ్లీ హుడ్స్ డీపీఎం ఎస్ కుసుమ కుమారి, మండల సమాఖ్య అధ్యక్షురాలు పి.సుభద్ర, ఎంపీడీఓ పి.శామ్యూల్ ఉన్నారు.

ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారిగా సుధాకర్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు జిల్లాల్లా ప్రజా రవాణా (ఆర్టీసీ) అధికారిగా ఎ.జాన్ సుధాకర్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈ స్థానంలో అదనపు బాధ్యతలతో పనిచేస్తున్న పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్‌ను రిలీవ్ చేశారు. జాన్ ప్రభాకర్ ప్రస్తుతం ఎన్‌టీఆర్ జిల్లా ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్టు తెలిసింది.

పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలి

అత్తిలి: సామాజిక పింఛన్లను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి సూచించారు. అత్తిలి యానాదుల పుంతలో గురువారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఎ.రాధాకృష్ణతో కలిసి ఆమె పాల్గొన్నారు. మే నెలకు సంబంధించి జిల్లాలో 2,25,231 మంది లబ్ధిదారులకు రూ.96.66 కోట్లు విడుదల చేసినట్టు కలెక్టర్ చెప్పారు. ఈ సందర్భంగా కాలనీ వాసులకు ప్లాస్టిక్ వినియోగంపై అనర్థాలను తెలియజేస్తూ జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్‌ఎస్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనడం లేదంటూ

రైతుల ధర్నా



తణుకు మండలం దువ్వలో ధర్నా చేస్తున్న రైతులు

తణుకు అర్బన్: తణుకు మండలంలో పండించిన పీఆర్ 126 రకం ధాన్యం కొనుగోలు చేయడంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది లోపంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సుబ్బరాజు అన్నారు. గురువారం దువ్వ రైతు సేవా కేంద్రం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పీఆర్ 126 ధాన్యం లోడు చేయొద్దని రైతు సేవ కేంద్రం సిబ్బంది రైతులకు చెప్పడం దారుణమని మండిపడ్డారు. గోనె సంచులు చినిగిపోయినవి ఇస్తున్నారని, సంచుల కొరత ఉందని అన్నారు. ఇంకా సుమారు 90 వేల సంచులు రావాల్సి ఉందన్నారు. ఏప్రిల్ 26న తేమశాతం తీసిన వారికి ఇంకా సంచులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. రెండు రోజుల క్రితం అత్తిలి మండలంలో ఒక రైస్ మిల్లుకి 489 బస్తా ధాన్యం వెళ్లగా మిల్లర్లు దిగుమతికి సంకోచించగా జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేశామన్నారు. గోనె సంచుల కొరత తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు రవికాంత్, జంపన వెంకట్ రాజు, నీలం బసవయ్య, నందివాడ వెంకన్న, మద్దూరి రాంబాబు, బంగారు రాజు, మురళీకృష్ణ, వీఎస్‌కే వర్మ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం రైతుల గగ్గోలు

- ధాన్యం కొనడం లేదని ఆందోళన
- రైతు సేవా కేంద్రాల వద్ద నిరసనలు





గురువారం రాత్రి 9 గంటల సమయంలో దెందులూరులో ధాన్యం లోడులతో రైతుల నిరసన

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం, ప్రభుత్వ నిర్వాకంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ధాన్యం టార్గెట్‌లు అయిపోయాయని, మేం కొనుగోలు చేయలేమంటూ ధాన్యం కేంద్రాల సిబ్బంది చెప్పడంతో ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలో 16 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయగా కొవ్వలి, దెందులూరుతో పాటు పలు గ్రామాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురువారం రాత్రి కొవ్వలి, దెందులూరు కేంద్రాల వద్ద రైతులు ధాన్యం ట్రాక్టర్లతో నిరసనలు తెలిపారు. నియోజకవర్గంలో ప్రభుత్వ ధాన్యం సేకరణ అధ్వానంగా ఉండటంతో గత్యంతరం లేక పంటను అయినకాడికి అమ్ముకుంటున్నామని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతి గింజా కొంటాం.. సరిపడా గోనె సంచులు ఇస్తాం.. సకాలంలో సొమ్ములు ఖాతాల్లో జమచేస్తామని పాలకులు చెప్పిన మాటలు ఇక్కడ మాత్రం అమలు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దెందులూరులో జరిగిన నిరసనలో గాసే రామారావు, నిట్టా సురేష్, వెంకటేష్, శ్రీను, మల్లయ్య, వీర్రాజుతో పాటు మరికొందరు రైతులు ఉన్నారు.

ఆన్‌లైన్ చేయట్లేదు



ధాన్యం కేంద్రంలో టార్గెట్ అయిపోయిందని చెప్పి ఆన్‌లైన్ చేయట్లేదు. అలాగని రైస్ మిల్లులు వద్దకు వెళితే కొనమని మిల్లర్లు చెబుతున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ధాన్యాన్ని రోడ్లపై ఉంచాం. సంచులు లేక కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనక, మిల్లర్లు కూడా కొనమంటే మా పరిస్థితి ఏంటి. అలాగే పాలగూడెం, దెందులూరు కేంద్రాల్లో ధాన్యం బస్తాకు 600 గ్రాములు తీస్తుంటే.. కొవ్వలిలో మాత్రం రెండు కిలోలు తీస్తున్నారు. అధికారులు ఈ విషయాన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలి.

–నాగరాజు, రైతు, కొవ్వలి

సీహెచ్‌ఓల నిరసన గళం

కూటమిపై తిరుగుబాటు

- నాలుగు రోజులుగా విధుల బహిష్కరణ
- కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శనలు
- ఉద్యోగ భద్రత, సమస్యల పరిష్కారమే లక్ష్యం
- జిల్లాలో 364 మంది సమ్మెలో..
- విలేజ్ క్లినిక్‌లలో నిలిచిన సేవలు



భీమవరం కలెక్టరేట్ వద్ద సీహెచ్‌ఓల ధర్నా (ఫైల్)



భగ్గేశ్వరంలో మూతపడిన విలేజ్ క్లినిక్

భీమవరం(ప్రకాశం చౌక్): గ్రామీణ ప్రాంతాల్లోని విలేజ్ క్లినిక్‌లలో సేవలందిస్తున్న సీహెచ్‌ఓలు (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్) (ఎన్‌హెచ్‌ఎం) తమ సమస్యలు పరిష్కరించాలంటూ విధులు బహిష్కరించారు. నాలుగు రోజులుగా భీమవరంలోని కలెక్టరేట్ వద్ద నిరసనలు తెలుపుతున్నారు. జిల్లాలోని 364 మంది సీహెచ్‌ఓలు సమ్మెలో ఉండటంతో విలేజ్ క్లినిక్‌లలో వైద్య సేవలు నిలిచిపోయాయి. దీంతో గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు దూరమయ్యాయి.

క్లినిక్‌లకు అద్దెల భారం : జిల్లాలో 364 విలేజ్ క్లినిక్‌లకు 145 క్లినిక్‌లు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఏ శాఖలో ఏ ఉద్యోగులు కూడా చేయని విధంగా అద్దె భవనాలకు సీహెచ్‌ఓలు అద్దెలు భరిస్తున్నారు. ఏడాదిగా సీహెచ్‌ఓలు ఇలా తమ జీతాల నుంచి అద్దె చెల్లిస్తున్నారు. క్లినిక్‌కు సగటును రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు మొత్తంగా రూ.36 వేల నుంచి రూ.40 వేల వరకు ఇప్పటివరకూ అద్దెలు చెల్లించారు. అలాగే విద్యుత్ బిల్లులు అదనంగా చెల్లిస్తున్నారు. ముందు వీరి అద్దెలు చెల్లిస్తే తర్వాత ప్రభుత్వం నుంచి బకాయిలు విడుదల చేస్తుంటారు. అయితే ఏడాదిగా అద్దె బకాయిలు రావాల్సి ఉందని సీహెచ్‌ఓలు అంటున్నారు.

సీహెచ్‌ఓల డిమాండ్లు

- 6 ఏళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న వారిని రెగ్యులరైజ్ చేయాలి.
- ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలి.
- పని ఆధారిత ప్రోత్సాహకాలు క్రమబద్ధీకరించాలి.
- ఈపీఎఫ్‌ను పునరుద్ధరించాలి
- క్లినిక్ అద్దె బకాయిలు చెల్లించాలి.
- నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలి.
- ఎఫ్ఆర్ఎస్ నుంచి సీహెచ్‌ఓలకు మినహాయింపు ఇవ్వాలి.
- ఇంక్రిమెంట్, ట్రాన్స్‌ఫర్, ఎక్స్‌గ్రేషియా, పితృత్వ సెలవులు అమలు చేయాలి.

ఎన్‌క్యూఎస్ సర్టిఫికెట్ కోసం..

నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ కమిటీ (ఎన్‌క్యూఎస్) సర్టిఫికెట్ పొందేందుకు విలేజ్ క్లినిక్‌లో పరికరాలు, నిర్వహణ కోసం ఒక్కో క్లినిక్‌లో సీహెచ్‌ఓలు రూ.50 వేల వరకు ఖర్చు చేశారు. వీటికి కూడా ప్రభుత్వం నుంచి చెల్లింపులు జరగలేదు. ఇలా జిల్లాలో సుమారు రూ.1.90 కోట్ల వరకు సీహెచ్‌ఓలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉంది. అలాగే సీహెచ్‌ఓల జీతాలకు సంబంధించి పీఎఫ్ సొమ్మును ప్రభుత్వం ఈపీఎఫ్‌ఓకు చెల్లించడం లేదు. ఇలా ఆరు నెలలుగా పీఎఫ్ సొమ్ము జమ కావడం లేదు.

సూపర్‌వైజర్లపై భారం : ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సూపర్‌వైజర్లతో విలేజ్ క్లినిక్‌లను నడిపించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేసి విధులు అప్పగిస్తున్నారు. జిల్లాలో 34 సీహెచ్‌సీలు, 136 మంది సూపర్‌వైజర్లు ఉన్నారు. విలేజ్ క్లినిక్‌ల బాధ్యతలు తమకు మరింత భారమని సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు ఆవేదన చెందుతున్నారు. విలేజ్ క్లినిక్‌లు మూతపడటంతో గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు దూరమయ్యాయి. చిన్నపాటి వైద్యానికి పెద్దాసుపత్రికి వెళ్లాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు.

క్లినిక్‌ల అద్దెలు కడుతున్నాం



జీతం నుంచే క్లినిక్‌లకు అద్దెలు కడుతున్నాం. మందులకు రవాణా ఖర్చులు, విద్యుత్ బిల్లులు కూడా భరిస్తున్నాం. మాకు పనికి తగిన వేతనం, ప్రమాదవశాత్తూ చనిపోతే కుటుంబాన్ని ఆదుకోవడానికి ఎక్స్‌గ్రేషియా, అలాగే మిగిలిన న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ నిరసనలు చేపట్టాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. – పి.శిరీష, సంఘ జిల్లా అధ్యక్షురాలు

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఆరేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రభుత్వం చెబుతున్న లెక్కల ప్రకారం కోతలు లేకుండా జీతం ఫిక్స్‌డ్‌గా ఇవ్వాలి. క్లినిక్‌ల వద్ద రక్షణ చర్యలు కల్పించాలి. ఆగస్టు 2022న కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో తమ పోస్టు రెగ్యులర్ అని పేర్కొన్నారు. ఈ మేరకు సర్వీసులు క్రమబద్ధీకరించాలి. – ఆర్.మాధురి, సీహెచ్‌ఓ

బిందు సేద్యానికి దరఖాస్తులు

తాడేపల్లిగూడెం రూరల్: డ్రిప్ ఇరిగేషన్‌కి ఆసక్తి ఉన్న రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సూక్ష్మ సేద్య పథకం జిల్లా డైరెక్టర్ పి.వీరభద్రరావు తెలిపారు. గురువారం తాడేపల్లిగూడెంలో ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం 1,000 హెక్టార్లలో డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ పరికరాలను రాయితీపై అందించాలని లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. రైతులకు రాయితీలు వర్తిస్తాయన్నారు. రైతులు ఆధార్ కార్డు, భూమి యాజమాన్య హక్కు పత్రంతో మండల ఉద్యాన శాఖ అధికారి, గ్రామ ఉద్యాన సహాయకుడు, గ్రామ వ్యవసాయ సహాయకుడు, సెరీకల్చర్ సహాయకుడిలో ఎవరో ఒకరికి రైతు సేవా కేంద్రం ద్వారా అందించాలన్నారు. అర్జీలు అందజేసిన రైతులు విధిగా బయోమెట్రిక్ వేయాలన్నారు.

మే డే.. ఐక్యత నిండే..



కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి.. ప్రపంచ కార్మికులారా ఏకం కండి.. అంటూ నినాదాలు హోరెత్తాయి.. ఊరూవాడా ఎర్రజెండాలు రెపరెపలాడాయి. ప్రపంచ కార్మిక దినోత్సవం (మే డే) సందర్భంగా గురువారం జిల్లావ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శ్రామికులు భారీ ర్యాలీలు నిర్వహించారు. భీమవరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల ర్యాలీ దృశ్యమిది. - భీమవరం

క్లుప్తంగా

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పంపిణీ



విద్యార్థులను అభినందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు(మెట్రో) : ఉమ్మడి **పశ్చిమగోదావరి** జిల్లాలోని జెడ్పీ హైస్కూళ్లలో **పదో తరగతి** చదవి అత్యుత్తమ ప్రతిభ కన**బరచిన ఆరు** గురు విద్యార్థినీ విద్యార్థులకు **ప్రతిభా పుర**స్కారాల పంపిణీ కార్యక్రమం **స్థానిక జెడ్పీ** మినీ సమావేశ మందిరంలో **గురువారం** నిర్వహించారు. ఏలూరు, **పశ్చిమగోదావరి,** తూర్పుగోదావరి జిల్లాల పరిధి**లో ప్రథమ, ద్వి**తీయ స్థానాల్లో నిలిచిన **విద్యార్థినీ విద్యా**ర్థులకు రూ.10 వేలు (ప్రథమ), **రూ.5 వేలు** (ద్వితీయ) చొప్పున పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ జి.పద్మశ్రీ వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కె.భీమేశ్వరరావు, జిల్లా విద్యాశాఖ అధికారులు ఎం.వెంకట లక్ష్మమ్మ, ఇ.నారాయణ, డీసీఈబీ కార్యదర్శి ఎ.సర్వేశ్వర రావు, డీవైఈవో ఎస్.రవీంద్ర భారతి, ఎంఈవోలు, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కోకో గింజల చోరీపై కేసు నమోదు

ద్వారకాతిరుమల: కోకో గింజల చోరీపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల ప్రకారం తిమ్మాపురం గ్రామానికి చెందిన గంటా అజయ్‌కుమార్ తన 6 ఎకరాల తోటలో పండే కోకో గింజలను నిత్యం తన ఇంటి వద్ద ఆరబెట్టి, విక్రయిస్తాడు. ఈ క్రమంలోనే 350 కేజీల కోకో గింజలను గత నెల 30న రైతు తన ఇంటి పక్కనున్న ఖాళీ స్థలంలో ఆరబెట్టాడు. సాయంత్రం వర్షపు చినుకులు పడుతున్నాయని కోకో గింజలను గుట్టగా చేసి, తడవకుండా బరకం కప్పాడు. గురువారం ఉదయం నిద్రలేచి చూసేసరికి కోకో గింజలు కనిపించలేదు. అర్ధ రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వాటిని దొంగిలించినట్లు గుర్తించి, స్థానిక పోలీ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వీటి విలువ రూ. 2 లక్షలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

అలంపురంలో హత్యాయత్నం

నిందితుల అరెస్ట్

పెంటపాడు: అలంపురంలో బుధవారం రాత్రి హత్యాయత్నం జరిగింది. పెంటపాడు ఎస్సై కె. స్వామి తెలిపిన వివరాల ప్రకారం ప్రత్తిపాడు గ్రామానికి చెందిన పెనుమాక రాజుకు, అదే గ్రామానికి చెందిన పేకేటి సుమన్‌కు మధ్య పాతగొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం అలంపురం రజకచెరువు గట్టున వెళుతున్న రాజుతో సుమన్, తనతో పాటు ఉన్న మరో ఇద్దరితో కలిసి ఘర్షణకు దిగాడు. వారి మధ్య మాటామాటా పెరిగి తీవ్ర ఘర్షణ చోటుచేసుకొంది. దీంతో సుమన్ తన వద్ద ఉన్న చాకుతో రాజును పొడిచాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని గూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్వామి చెప్పారు. నిందితుడు సుమన్‌తో పాటు, అతనికి సహకరించిన బాదంపూడి జయప్రకాష్, గనిసాల మణిరత్నంలను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.



రైఫిల్ షూటింగ్‌లో పాల్గొన్న కేడెట్లు



పరేడ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎన్‌సీసీ శిక్షణ.. ఉన్నతికి నిచ్చెన

- పెదవేగి మండలం పినకడిమిలో ఎన్‌సీసీ క్యాంప్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 602 మంది కేడెట్ల హాజరు
- షూటింగ్‌లో అదరగొట్టిన కేడెట్లు
- వృత్తి నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్న ఆర్మీ అధికారులు

పెదవేగి : పెదవేగి మండలం పినకడిమి గ్రామంలోని విన్సెంట్ డీపాల్ కళాశాలల్లో ఇండియన్ ఆర్మీ 19వ ఆంధ్రా బెటాలియన్ కల్నల్ అమిత్ పాండే ఆధ్వర్యంలో ఎన్‌సీపీ శిక్షణ ఉత్సాహంగా సాగుతోంది. మొత్తం 5 కళాశాలలు, 12 పాఠశాలల నుంచి 602 మంది కేడెట్లు ఈ క్యాంప్‌లో పాల్గొని వృత్తి నైపుణ్యాలపై అవగాహన పెంపొందించుకుంటున్నారు. గత నెల 24 నుంచి ఈ శిక్షణ ప్రారంభం కాగా ఈనెల 3వ తేదీతో ముగుస్తుంది. శిక్షణలో భాగంగా రైఫిల్ షూటింగ్, డ్రిల్, దేశ సరిహద్దుల్లో ఆర్మీ శిబిరాలు ఏ విధంగా ఉంటాయో కేడెట్లకు అవగాహన కల్పించారు. ఎన్‌సీసీలో శిక్షణ ద్వారా దేశభక్తి, నైతిక విలువలు పెంపొందింపజేయడం, క్రమశిక్షణ, సాయం చేసే తత్వం అలవడతాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయడంతోపాటు వివిధ రకాల ఉద్యోగాలు, కళాశాలల అడ్మిషన్‌లలో ప్రాధాన్యత కల్పిస్తారు. సుబేదార్ మేజర్ జె ఆదినారాయణ, ఎన్‌సీసీ అధికారులు ఎం సోమశేఖర్, కె భీమేశ్వరరావు, ఎస్ అనంత రాజ్యలక్ష్మి, లాజరస్, వలీ, ధనరాజు, చీలి తంబి, వీరమ, సూపరింటెండెంట్ కొండయ్య, ఆర్మీ, సివిల్ సిబ్బంది ఈ ఎన్‌సీపీ క్యాంప్‌ను నిర్వహిస్తున్నారు.



డైమండ్ షూటింగ్‌ను నేర్పుతున్న ఆర్మీ అధికారి

అన్ని రకాల స్ట్రక్చర్ ట్రైనింగ్ ఇస్తున్నాం



ఈ క్యాంప్‌లో మిలటరీ క్రమశిక్షణను విద్యార్థులు నేర్చుకున్నారు. మ్యాప్ రీడింగ్, షూటింగ్, నేషనల్ ఇంటిగ్రేటర్ సిమిలేటర్ ఫైరింగ్, వెపన్ హ్యాండ్లింగ్ వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చాం. చాలెంజ్‌లు స్వీకరించడం, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడంపై నైపుణ్యం కలిగిన వ్యక్తులతో అవగాహన కల్పించాం. రోడ్డు భద్రతా చర్యలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, అన్ని రకాల స్ట్రక్చర్ ట్రైనింగ్ ఇక్కడ ఇస్తున్నాం. సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు దేహదారుఢ్యం, ప్రాథమిక యుద్ధ తంత్రాలపై శిక్షణ ఇచ్చాం. ఏలూరు జిల్లా అడిషనల్ ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు డ్రగ్స్ చెడు పరిణామాలపై అవగాహన కల్పించారు.

– కల్నల్ అమిత్‌పాండే, క్యాంప్ కమాండింగ్ అధికారి, 19 ఆంధ్రా బెటాలియన్

ఆర్మీ ఆఫీసర్ లక్ష్యం



ఎన్‌సీసీలో చేరడంతో నాలో చాలా మార్పు వచ్చింది. జీవితంలో ఏదైనా సాధించగలనన్న నమ్మకం ఏర్పడింది. భవిష్యత్‌లో ఆర్మీ ఆఫీసర్ అవ్వాలని అనుకుంటున్నాను.

– కె సంపత్‌సాయి, 9వ తరగతి, భారతీయ విద్యాభవన్, భీమవరం

దేశానికి సేవ చేయాలి



ఎరోనాటికల్ ఇంజనీర్ అయ్యి దేశానికి సేవలు అందించాలని ఆశపడుతున్నాను. తల్లిదండ్రులు, మా ఎన్‌సీసీ అధికారులు చాలా ప్రోత్సహిస్తున్నారు.

– ఎం ప్రభాకర్, 9వ తరగతి, భారతీయ విద్యాభవన్, భీమవరం

గన్ ఫైరింగ్ బాగా నచ్చింది



నా ధ్యేయం ఐపీఎస్ ఆఫీసర్. ఎన్‌సీసీలో నాకు ఫైరింగ్ బాగా నచ్చింది. దేశానికి సేవ చేయాలని ఆశగా ఉంది. ఎన్‌సీసీ కుటుంబం అన్ని రకాలుగా నాకు అండగా ఉంది.

– బి నాగనిఖిల, బీబీఏ ద్వితీయ సంవత్సరం, సెయింట్ థెరిస్సా, ఏలూరు

ధైర్యంగా జీవించేలా శిక్షణ



ఈ ఎన్‌సీసీలో ఒక అమ్మాయి ధైర్యంగా సమాజంలో ఎలా రాణించాలో నేర్చుకున్నాను. ఆర్మీలో డిఫెన్స్ సర్వీస్‌లో సేవలు అందించాలని అనుకుంటున్నాను. ఆర్మీ మహిళలకు కూడా ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహిస్తుందని గ్రహించాను.

– బి సమృద్ధి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం, సర్ సీఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్

సమయపాలన అలవాటైంది



సమయపాలన పాటించడం బాగా నేర్పించారు. ఇండియన్ రైల్వే పోలీస్ ఆఫీసర్‌గా పనిచేయాలని కోరుకుంటున్నాను.

– పి జోషిత, బీకాం ఫైనల్ ఇయర్, సెయింట్ థెరిస్సా

ఎయిర్‌ఫోర్స్ ఆఫీసర్ అవుతా



ఎన్‌డీఏలో జాయిన్ అయ్యి ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్‌ని అవ్వాలని ఉంది. విభిన్న రకాల వ్యక్తులతో ఎలా మెలగాలో నేర్పారు. దేశం పట్ల ప్రేమ చాలా పెరిగింది.

– డీ అభిలాష్, సీబీఎస్‌ఈ ప్లస్‌వన్, సర్ సీఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్

నా తండ్రి ప్రోత్సహించారు



ఈ క్యాంప్‌లో ఐకమత్యం, క్రమశిక్షణలను బాగా నేర్పించారు. నా తండ్రి ప్రోత్సాహంతో క్యాంప్‌కు వచ్చాను. ఇండియన్ ఎయిర్‌వింగ్ నా లక్ష్యం.

– యు శ్రావ్యమౌనిక, 9వ తరగతి, భారతీయ విద్యాభవన్, భీమవరం

సద్వినియోగం చేసుకోవాలి



డ్రగ్స్ దుష్ప్రభావాలు, సైబర్ క్రైమ్, తదితర విషయాలపై పూర్తి అవగాహన కల్పించారు. అమ్మాయిలు ధైర్యంగా ఇలాంటి క్యాంప్‌లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలి.

– డీ దీప, 9వ తరగతి, ఏకేఆర్‌జీ, నల్లజర్ల

ఇండియన్ రైల్వే ఆఫీసర్ అవ్వాలి



ఇండియన్ రైల్వే ఆఫీసర్ అవ్వాలని కోరిక. మిలటరీ జీవన విధానం, క్రమశిక్షణ నేర్చుకున్నాను.

– జి పవన్‌కుమార్, 9వ తరగతి, టీబీఆర్ సైనిక్ స్కూల్, అలంపురం

వ్యవసాయ పరిశోధనా ఫలితాలు
రైతులకు చేరువ చేయాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

పెనుమంట్ర: వ్యవసాయ పరిశోధనా ఫలితాలు కేవలం పరిశోధనా స్థానానికే పరిమితం కాకుండా శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఫలితాలు రైతులకు చేరువ చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో రెండు రోజుల పాటు జరిగే గోదావరి మండల పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశాన్ని గురువారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. మార్టేరు వ్యవసాయ పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ టి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మార్టేరు పరిశోధన స్థానంలో విడుదల చేసిన వరి రకాలు ప్రపంచ వ్యాప్తంగా 9 శాతం, భారతదేశంలో 33 శాతం విస్తీర్ణంలో సాగు చేస్తున్నారని, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన స్వర్ణ రకం ఈ పరిశోధనా స్థానం నుంచి విడుదల కావడం గర్వించదగ్గ విషయమన్నారు. పీఆర్ 126 రకానికి ప్రత్యామ్నాయ రకాలైన ఎంటీయూ 1290, ఎంటీయూ 1293, ఎంటీయూ 1273 రకాలను ప్రదర్శన క్షేత్రాల్లో సాగు చేసి రైతులు అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. గుర్రపుడెక్క నుంచి కంపోస్టు తయారు చేసే ప్రక్రియను డ్వాక్రా సంఘాల ద్వారా నిర్వహిస్తున్నామని, డి కంపోజర్‌ల వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. మరో ముఖ్య అతిథిగా వ్యవసాయ రంగ విశ్వ విద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు అవకాశం ఉన్న ప్రాంతాల్లో అనువైన సాంబ మసూరి(బీపీటీ 5204) మార్టేరు సాంబ(ఎంటీయూ 1224) మసూరి (ఎంటీయూ 1262) వంటి సన్నగింజ రకాలను సాగుచేయాలని అన్నారు. మరో ముఖ్య అతిథి ఆచార్య ఎన్జీ రంగా విశ్వ విద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి శివన్నారాయణ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ వ్యవసాయ పరిస్థితులు, నెలకొన్న సమస్యలను గుర్తించి వాటికి తగ్గట్టుగా విస్తరణ ప్రణాళికలను రూపొందించాల్సి అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో గత సమావేశంలో రైతులు లేవనెత్తిన సమస్యలపై తీసుకున్న కార్యాచరణ, 2024–25 సంవత్సరపు పరిశోధన ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సభికులకు తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి జడ్ వెంకటేశ్వరరావు, ఎస్‌కే బాషా, మాధవరావు, శ్రీహరి, వివిధ జిల్లాలనుంచి వచ్చిన వ్యవసాయ అధికారులు, అభ్యుదయ రైతులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



మార్టేరు వ్యవసాయ పరిశోధనా క్షేత్రంలో డ్రోన్‌లు, పవర్ స్ప్రేయర్ల పనితీరును కలెక్టర్‌కు వివరిస్తున్న డాక్టర్ పీవీ సత్యనారాయణ

శీతల పానీయాలతో జాగ్రత్త!

- కూల్‌డ్రింక్స్‌తో అనారోగ్యం తప్పదంటున్న నిపుణులు
- సంప్రదాయ పానీయాలే మేలని సూచన



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి జిల్లాలో గత కొన్ని రోజులుగా 38 నుంచి 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదవుతోంది. దీంతో ప్రజలు దాహం తీర్చుకునేందుకు తహతహ లాడుతున్నారు. ఎండ తీవ్రత నేపథ్యంలో చల్లదనం కోసం ప్రజలు ఎక్కువగా కూల్‌డ్రింక్స్ వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో ఎక్కడ చూసినా కూల్‌డ్రింక్స్ దుకాణాలు కళకళ లాడుతున్నాయి. అయితే రుచితో పాటు ఆరోగ్యమూ ప్రధానమని కూల్‌డ్రింక్స్ కంటే సంప్రదాయ ద్రవాలే మేలని వైద్యులు సూచిస్తున్నారు. ఒక్క ఏలూరు నగరంలోనే వివిధ కంపెనీల కూల్‌డ్రింక్స్ వ్యాపారం రోజుకు సుమారు 60 నుంచి 70 వేల బాటిల్స్ అమ్మకాలు జరుగుతున్నాయని, వాటి ద్వారా సుమారు రూ.20 లక్షల వరకూ వ్యాపారం జరుగుతోందని అంచనా.

కూల్‌డ్రింక్స్‌తో అనారోగ్యం

ప్రస్తుతం అన్ని దుకాణాల్లో శీతల పానీయాలు లభిస్తున్నాయి. ఫుట్‌పాత్‌పై వెలసిన దుకాణాల నుంచి కిరాణా దుకాణాలు, రెస్టారెంట్లు, కూల్‌డ్రింక్ షాపులు, ప్రత్యేకంగా వెలసిన ఫ్రూట్‌జ్యూస్ దుకాణాల్లో సైతం కూల్‌డ్రింక్స్ లభిస్తున్నాయి. రెడీమేడ్‌గా తయారు చేసిన ద్రవంతో అప్పటికప్పుడు కొన్ని రకాల కూల్‌డ్రింక్స్ తయారు చేసి అందిస్తున్నారు. ఇటీవలి కాలంలో మాక్ టైల్స్ పేరుతో వివిధ రంగుల్లో ద్రావకాలను కలిపి ఇస్తున్నారు. వీటితోపాటు కొన్ని చెరకు, బత్తాయి రసాలు, మజ్జిగ దుకాణాల్లో అపరిశుభ్రమైన నీటితో తయారైన ఐస్ ముక్కలను వాడుతున్నారు. ప్రతి దుకాణంలో రోజుకు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు వ్యాపారం సాగుతోంది. ఇలాంటి పానీయాలు ఆరోగ్యానికి హానికరమని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

రంగులు, రసాయనాలతో పలు జబ్బులు

శీతల పానీయాల్లో వాడే కార్బన్ డై ఆక్సైడ్, ఫాస్పరస్ ఆమ్లాలు శరీరంలోకి చేరి కణాల్లోని ఆక్సిజన్ నిల్వలను తగ్గించి కేన్సర్‌కు దారి తీస్తాయని చెబుతున్నారు. దీనితో పాటు సోడియం బెంజోయేట్ అనే ప్రిజర్వేటివ్ రసాయనం శరీరంలో కణాల్లోని డీఎన్‌ఏపై ప్రభావం చూపుతాయంటున్నారు. వాటిలోని అదనపు కేలరీలు ఊబకాయానికి దారి తీస్తాయని, పానీయంలో ఉండే ఫ్రక్టోజ్ వల్ల రక్తపోటు పెరుగుతుందని వివరిస్తున్నారు. వాటిని అధికంగా సేవిస్తే దంతాలపై పార దెబ్బతింటుందని, కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశం ఉందని, దీర్ఘకాలంగా శీతల పానీయాలు తాగితే మెటబాలిక్ సిండ్రోమ్ అనే వ్యాధి వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

సంప్రదాయ పానీయాలే మేలు

రసాయనాలు, నిషేధిత రంగులు, అపరిశుభ్రమైన ఐస్ ముక్కలను కలిపిన కూల్‌డ్రింక్స్ తాగడం కంటే సహజసిద్ధమైన సంప్రదాయ పానీయాలను తాగడం ఆరోగ్యకరమని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా మనం ఇంట్లో తయారు చేసుకునే మజ్జిగ, లస్సీ, నిమ్మరసం, తాజా పండ్ల జ్యూస్‌లు, కొబ్బరి నీళ్లు, రాగిమాల్ట్, నన్నారి షర్బత్ మొదలైనవి శరీరానికి చల్లదనాన్ని ఇవ్వడమే గాక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చెబుతున్నారు.

కూల్‌డ్రింక్స్ హాని చేస్తాయి



చాలా మంది వేసవి వచ్చిందంటే కూల్‌డ్రింక్స్ తాగేందుకే మక్కువ చూపుతారు. వాస్తవంగా అందులో పొటాషియం ఉన్న ఉప్పు ఉంటుంది. ఇది శరీరానికి హాని చేస్తుంది. దానికి బదులు మజ్జిగ, నిమ్మకాయ సోడాలో ఉప్పు వేసుకుని తాగాలి. మనం వేసుకొని తాగే ఉప్పులో సోడియం ఉంటుంది. దీంతో పాటు కూరల్లోనూ ఉప్పును వాడాలి. ప్రతిఒక్కరూ రోజుకు నాలుగు లీటర్ల మంచినీటిని తాగాలి. ఎండవేడిమి కారణంగా మూత్రం పచ్చగా వస్తుంది. కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశం ఉంది. మాంసాహారం మితంగా తీసుకోవాలి. నిమ్మజాతి పండ్లను బాగా తినాలి.

– డాక్టర్ ఎంఎల్‌వీ ప్రసాద్, ఆంధ్రా హాస్పిటల్స్ డైరెక్టర్

7 నుంచి సత్యదేవుని బ్రహ్మోత్సవాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి దత్తత ఆలయమైన రంగాపురంలోని శ్రీ భూనీళా సహిత శ్రీ సత్యనారాయణ స్వామివారి 61వ దివ్య బ్రహ్మోత్సవాలను ఈనెల 7 నుంచి 14 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి గురువారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 7న ఉదయం 8.45 గంటలకు అర్చకులు స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరిస్తారని, 8న ముత్సంగ్రహణం, అంకురార్పణ, 10న ఔపాసన బలిహరణాదులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 11న రాత్రి 9 గంటల నుంచి తిరుకల్యాణ మహోత్సవం, 12న రాత్రి 7 గంటల నుంచి స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం, 13న ఉదయం 8 గంటల నుంచి మహా పూర్ణాహుతి, చూర్ణోత్సవం, వసంతోత్సవం, అపభృధ స్నానం, రాత్రి 8 గంటల నుంచి ధ్వజావరోహణను కనుల పండువగా నిర్వహిస్తారని వివరించారు. 14న రాత్రి 8 గంటల నుంచి జరిగే శ్రీ పుష్పయాగోత్సవం, ద్వాదశారాధనలు, పవళింపు సేవ వేడుకలతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని ఈఓ పేర్కొన్నారు. భక్తులంతా ఈ వేడుకల్లో పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం

ఏలూరు రూరల్ : జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 50 శిక్షణా శిబిరాల్లో ఈనెల 31 వరకూ బాలబాలికలకు వివిధ ఆటలపై శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతి శిబిరంలో సుమారు 30 నుంచి 50 పిల్లలు సాధన చేయనున్నారు. 8 నుంచి 14 ఏళ్లలోపు బాలబాలికలకు శిక్షణ అందించి క్రీడాకారులుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా ఈ శిబిరాలు నిర్వహిస్తున్నారు. శిక్షణ పూర్తి చేసిన పిల్లలకు ఈనెల 31వ తేదీన పోటీలు నిర్వహించి బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందిస్తామని డీఎస్‌డీఓ బి.శ్రీనివాసరావు తెలిపారు. క్రీడా శిక్షణా శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఏ క్రీడా శిబిరం ఎక్కడంటే..

- **అథ్లెటిక్స్:** ఏలూరులో ఏఎస్ఆర్ స్టేడియం, సీఆర్ఆర్ కళాశాల, జంగారెడ్డిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి జడ్పీ పాఠశాల, చేగొండపల్లి ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్, కూచింపూడి ఎంపీయూపీ స్కూల్, కైకరం, గోకవరం జడ్పీ పాఠశాలలు.
- **ఆర్చరీ:** రావికంపాడు జెడ్పీ పాఠశాల
- **బాస్కెట్‌బాల్ :** నూజివీడులో వీటిహెచ్ గ్రౌండ్, డీఏఆర్ కళాశాల, ఏలూరు ఇండోర్‌స్టేడియం
- **బాల్ బ్యాడ్మింటన్ :** నూజివీడు వీటీహెచ్ గ్రౌండ్
- **చెస్ :** ఏలూరు స్వర్ణభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్



ద్వారకాతిరుమలలో ఇండోర్ రోయింగ్ సమ్మర్ కోచింగ్ శిబిరం

- **ఫుట్‌బాల్ :** పంగిడిగూడెం, నూజివీడు జీఎంహెచ్ హాస్పటల్ గ్రౌండ్, కొయ్యలగూడెం, ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియం
- **హేండ్‌బాల్ :** ఏలూరులో సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్, సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల, ఏలూరు ఇండోర్ స్టేడియం, శనివారపుపేట రాయన్ ఇంగ్లీషు మీడియం స్కూల్, ఏలూరు కస్తూరిభా బాలికల పాఠశాల, జోగన్నపాలెం ఎస్‌వీఎన్ హైస్కూల్, ఏలూరు కేపీడీటీ హైస్కూల్, నూజివీడు డీఏఆర్ కళాశాల
- **హాకీ :** ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియం
- **జూడో :** ఏలూరు సిద్ధార్ధ క్వెస్ట్ పబ్లిక్ స్కూల్
- **కబడ్డీ :** ఈస్ట్ యడవల్లి, జడ్పీ పాఠశాల
- **ఖోఖో:** ఏలూరు సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్, ఏలూరు సిద్ధార్ధ క్వెస్ట్ పబ్లిక్ స్కూల్
- **రోయింగ్ :** ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం ఎర్రకాలువ రిజర్వాయర్
- **టేబుల్ టెన్నిస్ :** ఏలూరులో సిద్ధార్ధ క్వెస్ట్ పబ్లిక్ స్కూల్, సీఆర్ఆర్ పబ్లిక్‌స్కూల్
- **టెన్నిస్ :** ఏలూరు సీఆర్ఆర్ డిగ్రీ కళాశాల, నూజివీడు జేబీకే క్లబ్, వీటీహెచ్ గ్రౌండ్స్
- **వాలీబాల్ :** ఏలూరు సిద్ధార్ధ క్వెస్ట్ పబ్లిక్ స్కూల్, వట్లూరు జడ్పీ పాఠశాల, కొల్లేటికోట కమ్యూనిటీ హాల్ ఎదురుగా
- **వెయిట్‌లిఫ్టింగ్ :** చాటపర్రు వెయిట్‌లిఫ్టింగ్ హాల్, ఏలూరు ఇండోర్‌స్టేడియం, ఏఎస్ఆర్ స్టేడియం
- **యోగా :** ఏలూరు ఎంఆర్‌ఎఫ్ షోరూం ఆప్ స్టైర్ హాల్
- **కయాకింగ్ :** జంగారెడ్డిగూడెం ఎర్రకాలువ రిజర్వాయర్
- **స్కేటింగ్ :** ఏలూరు ఇండోర్‌స్టేడియం

రోయింగ్ సమ్మర్ కోచింగ్ ప్రారంభం

ద్వారకాతిరుమల: స్థానిక వసంత్‌నగర్ కాలనీలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏలూరు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత ఇండోర్ రోయింగ్ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను గురువారం క్యాంప్ ఇన్‌చార్జి, కోచ్ ఊదర్ల విజయ్ ప్రారంభించారు. స్కల్లింగ్, రోయింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని, కార్యదర్శి ఎన్ పవన్ కుమార్, కోచ్ విజయ్ మాట్లాడుతూ ఈ ఉచిత క్యాంపును నెలరోజుల పాటు నిర్వహిస్తామన్నారు. పిల్లలకు ఈ కోచింగ్ క్యాంప్ ఎంతగానో ఉపయోగ పడుతుందని చెప్పారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, పడవల మోహన్‌బాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సత్యసాయి సేవా సమితి కార్యక్రమాలు అభినందనీయం



ఉచిత టైలరింగ శిక్షణలో సర్టిఫికెట్స్ అందజేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సత్యసాయి బాబా శత జయంతి సందర్భంగా సత్యసాయి సేవా సమితి వారిచే మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమం జరిగింది. మందిరంలో గురువారం శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కోర్సు పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్స్ అందజేశారు. జిల్లా శ్రీ సత్య సాయి సేవా సంస్థలు జిల్లా అధ్యక్షుడు కె.రవీంద్రప్రసాద్, జిల్లా మహిళా ఐటీ కోఆర్డినేటర్ కవిత, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఇన్‌చార్జి నాగ ప్రసాద్, సమితి కన్వీనర్ ఎంఎస్ఎస్‌కే జనార్ధనరావు, జంధ్యాల నాగేశ్వరరావు, ఆకుల నవీన్‌బాబా, సమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు శివాలయానికి విరాళం



శివాలయానికి చెక్కును అందజేస్తున్న దాత వీర్ల తాతారావు

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడు గ్రామంలో నూతనంగా ప్రతిమాంబసమేత సదాశివ స్వామివారి ఆలయం నిర్మాణం వేగంగా జరుగుతోంది. గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఆలయానికి ఇప్పటికే పలువురు విరాళాలు అందజేశారు. గురువారం ప్రత్తిపాడుకు చెందిన ప్రముఖులు స్వర్గీయ వీర్ల తాతారావు కుమారుడు, వారి కుటుంసభ్యుల ఆధ్వర్యంలో ఆలయనిర్మాణానికి రూ.1.11 లక్షలు అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ నిర్వాహకులు, కమిటీ చైర్మన్ వీర్ల కృష్ణకు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వన్ టౌన్‌లోని పాతూరు సెమి ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో మహాలక్ష్మినగర్, పీఅండ్‌టీ కాలనీ ఫీడర్లకు సంబంధించి ఈ నెల 2వ తేదీన విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.నరసింహామూర్తి వెల్లడించారు. వన్ టౌన్‌లోని డీఎస్ చెరువు ఏరియా, ఝాన్సీరాణి ఆసుపత్రి ఏరియా, పంపులు చెరువు, మహాలక్ష్మినగర్, సత్యవతినగర్, చెట్లు రోడ్డు, టీటీడీ కల్యాణ మండపం రోడ్డులలో విద్యుత్ లైన్‌లు మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

- టూ టౌన్‌లోని యాగర్లపల్లి సబ్ స్టేషన్‌కు సంబంధించి యాగర్లపల్లి, కొబ్బరితోట, రామచంద్రరావుపేట, భాగ్యలక్ష్మీపేట, ఏలూరు రోడ్డు, పడాల, ముత్యాలంభపురంలలో విద్యుత్ లైన్‌లు సరిచేయడం, విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్లు కొమ్మలను నరికే నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు. ఈ పనులు నిమిత్తం పెంటపాడు మండలంలోని జెట్టిపాలెం, ఉమా మహేశ్వరం, మౌంజిపాడు, వెస్ట్‌విప్పర్రు గ్రామాలలో కూడా విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వివిధ గ్రామల ప్రజలు సహకరించాలని కోరారు.

బొలిశెట్టి, బాబ్జితో సమన్వయ కమిటీ భేటీ



సమన్వయ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు, వలవల బాబ్జీ

తాడేపల్లిగూడెం: తాను చనిపోతే బై ఎలక్షన్స్ వస్తాయని తన వెనుక ఉండే కొందరు నాయకులు ఆశిస్తున్నారంటూ స్థానిక ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ బుధవారం సంచలన ప్రకటన చేసిన విషయం తెలిసిందే. ఈ ప్రకటన కూటమిలో కుదుపునకు దారితీసింది. ఈ క్రమంలో టీడీపీ, జనసేన నాయకులతో ఉన్న సమన్వయ కమిటీ నుంచి బొలిశెట్టికి, వలవల బాబ్జికి విజయవాడ నుంచి గురువారం వర్తమానం అందింది. దీంతో ఇద్దరూ సమావేశానికి హాజరయ్యారు. ఈ క్రమంలో వారిద్దరి మధ్య వివాదంపై సమన్వయ కమిటీ చర్చించినట్టు తెలిసింది.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కాళ్ల: ప్రకృతి వ్యవసాయాన్ని రైతులంతా ఒక ఉద్యమంగా చేపట్టాలని సర్పంచ్ భూపతి రాజు జగ్గబాబు రైతులందరికీ తెలిపారు. ఏలూరుపాడు గ్రామంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.

కార్మిక హక్కుల రక్షణకై పోరాటాలకు సిద్ధం కావాలి

- తాడేపల్లిగూడెం, తణుకు డివిజన్లలో మేడే వేడుకలు
- కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు..



తణుకులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే ర్యాలీలో పాల్గొన్న కోనాల భీమారావు



తాడేపల్లిగూడెం మండలంలో సీపీఎం జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్



పెంటపాడు: మేడే వేడుకలలో జెండా ఎగర వేస్తున్న సీపీఎం నాయకులు

తణుకు అర్బన్: కార్మిక, కర్షక దినోత్సవమైన మేడేను కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తణుకు నియోజకవర్గంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా తణుకు పట్టణ రహదారుల్లో కార్మికులు ర్యాలీలు నిర్వహించి మేడే విశిష్టతను చాటిచెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు శాఖల్లో పనిచేస్తున్న కార్మికులంతా మేడే వేడుకల్లో పాల్గొని ర్యాలీలో పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో లేబర్ కోడ్‌లు రద్దుకు పోరాడాలి..

8 గంటల పని అమలుకు 44 కార్మిక చట్టాల పునరుద్ధరణ, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు కోరుతూ మేడే ఉద్యమ పోరాట స్ఫూర్తితో సంఘటిత పోరాటాలకు కార్మికులు సమాయత్తం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపునిచ్చారు. గురువారం మేడే వేడుకలు ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో తణుకులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం రద్దు చేసి కార్మికులను కట్టుబానిసలను చేస్తుందన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు సికిలే పుష్పకుమారి, ఎఐటియుసి,సీపీఐ నాయకులు కొంబత్తుల రవికుమార్, మందుల ముత్తయ్య, అనంత త్రివిక్రమ్, దాకే మునలయ్య, దేవ పెద్దిరాజు, అట్రు వెంకట్రావు, సావారపు దేవి, పిండి సత్యవతి, వలవల అరుణకుమారి, బొద్దాని మురళీ కృష్ణ, రాజశేఖర్ పతి, బొంగు శ్రీరామ్మూర్తి, కొరు శ్రీను, ముద్దన మురళి, ధర్మాని పుష్పలత, బోడపాటి నారాయణ, మార్లపూడి బర్నా, పెదపోలు వెంకట్రావు పాల్గొన్నారు.

కార్మికులకు లాభాల్లో వాటాలివ్వాలి..

ఉత్పత్తి కారకులు, సంపద సృష్టి కార్మికులకు లాభాల్లో వాటా ఇవ్వాలని ఏఐటీయూసీ నేత, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆఫ్ శ్రీ అక్కమాంబ టెక్స్ టైల్స్ అధ్యక్షుడు డీవీవీఎస్ వర్మ అన్నారు. మేడే సందర్భంగా గురువారం తణుకు అక్కమాంబ టెక్స్ టైల్స్ యూనియన్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన మేడే సభకు వర్మ అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్మికులు హక్కులు కాలరాస్తే ఏ ప్రభుత్వం అయినా అధికారం నుంచి గద్దె దిగాల్సిందేనని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజారామ్మోహన్‌రాయ్ హెచ్చరించారు. గురువారం స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద 139 వ మేడే సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్పొరేట్లకు కార్మికులను బానిసలుగా మార్చే ప్రయత్నాలు విరమించుకోక పోతే తగిన గుణపాఠం దేశ కార్మికులు నేర్పుతారని అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్, మండల అధ్యక్షులు ఎన్. ఆదినారాయణ బాబు, మండల కార్యదర్శి గుబ్బల గోపి, సొసైటీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, ఎల్ఐసీ ఏజెంట్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు జీవీఎల్ నర్సింహారావు, గార రంగారావు, యన్. రామారావు, అన్నెం సూర్యనారాయణ, వాన్ బరి యూనియన్ కార్యదర్శి వల్లూరి వెంకటేశ్వరావు, హర్ష వర్ధన్, జట్టు మేస్త్రీలు రమణ, సూరిబాబు, యన్. చిన్నారావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మేడే వేడుక

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలంలో గురువారం కార్మిక దినోత్సవ మేడేను ఘనంగా నిర్వహించారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నవాబుపాలెం, జగన్నాథపురం, కొమ్ముగూడెం, బంగారుగూడెం, మాధవరం, ఇటుకులగుంట, వెంకట్రావుపాలెం, నీలాద్రిపురం గ్రామాల్లో కార్మిక జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ పాలుపూరి సత్యనారాయణ, మండల నాయకులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న హక్కులను, చట్టాలను పూర్తిగా తీసివేసి, సారం లేని లేబర్ కోడ్‌లను కేంద్రంలోని మోడీ సర్కారు రుద్దుతుందన్నారు. దీనికి వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆ సంఘ అధ్యక్షుడు ఆమంచి సత్యనారాయణ, నీలాద్రిపురం ఏరియా అధ్యక్షుడు బంగారుగూడెం, వీరంపాలెం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పెనుగొండ శ్రీనివాస్, పూరెళ్ల కృష్ణ, కే.చంద్రబాబు, జి. సీతారామమూర్తి, ఎం.నాగేశ్వరరావు, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణకై పోరాడాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మిక హక్కులు, కార్మిక చట్టాలు పరిరక్షించేందుకు, మేడే పోరాట స్ఫూర్తితో కార్మిక వర్గం సమరశీల ఉద్యమాలు కొనసాగించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ పిలుపునిచ్చారు. ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మే డే ర్యాలీ జరిగింది. అన్ని రంగాల కార్మికులు ఎర్ర జెండాలను ధరించి తీన్మార్ డప్పులతో, నృత్యాలతో ర్యాలీ భారీగా సాగింది. స్థానిక వాసవి కన్యక పరమేశ్వరీ కళ్యాణ మందిరంలో జరిగిన బహిరంగ సభలో సోమసుందర్ మాట్లాడుతూ 8 గంటల పనిదినం కోసం నూటా ముప్పై తొమ్మిదేళ్ల క్రితం చికాగో కార్మికులు సాగించిన పోరాటం, చేసిన త్యాగం స్ఫూర్తితో ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు సంఘటితం అయ్యారని, అనేక హక్కులు సాధించుకున్నారని తెలిపారు. స్వాతంత్ర్యం రాక ముందే ఏఐటీయూసీ దేశంలో కార్మికుల కోసం పోరాడిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ వర్గాలకు కొమ్ముకాస్తూ, కార్మిక హక్కులను హరిస్తుందని, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ పరం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు ఓసూరి వీర్రాజు, మందలపర్తి హరీష్, తాడికొండ శ్రీనివాసరావు, కళింగ లక్ష్మణరావులు మాట్లాడుతూ అసంఘటిత కార్మికులకు కనీస వేతనం, కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, ప్రైవేటీకరణ విధానాలను విడనాడాలని కోరుతూ మే 20వ తేదీన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలలోను అన్ని యూనియన్లు ఆధ్వర్యంలో మే డే జెండాను ఆవిష్కరించారు.

ఘనంగా మేడే వేడుకలు

పెంటపాడు: మండలంలో పలు గ్రామాలలో గురువారం మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సీఐటీయు, జెండాను సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి చింతకాయల బాబూరావు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలలో ర్యాలీ నిర్వహించారు. పెంటపాడు గాంధీబొమ్మ సెంటర్‌లో సీపీఎం పార్టీ జెండాను చిర్ల పుల్లారెడ్డి ఆవిష్కరించారు. దర్శిపర్రు గ్రామంలో జె. శ్రీనివాస్, ముదునూరు గ్రామంలో వడ్డి సత్యనారాయణ, రాచర్ల గ్రామంలో పనసయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నేస్తం...'ఈ శ్రమ్' పోర్టల్



న్యాయ విజ్ఞాన సదస్సులో అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా

తాడేపల్లిగూడెం (టీఓసీ): అసంఘటిత కార్మికులకు సామిజక భద్రత కల్పించడానికి ఈశ్రమ్ పోర్టల్ పెట్టిందని రాష్ట, జిల్లా న్యాయసేవాధికార సంస్థల ఆదేశాలు మేరకు 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ బాషా తెలిపారు. మే డే సందర్భంగా గురువారం ఆటో డ్రైవర్లకు న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. సికిందర్ బాషా మాట్లాడుతూ ఇ-శ్రమ కార్డులను నమోదు చేయించుకోవాలని తెలిపారు. కార్మికులకు గల హక్కులు, బాధ్యతలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, వివిధ చట్టాలు, వాటి ఉపయోగాలుపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్ శ్రీ, జూనియర్ సివిల్ జడ్జి లలిత కుమారి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శిరిగినీడి విజయకృష్ణ, ఇతర న్యాయవాదులు, ఆటోయూనియన్ సభ్యులు, డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): 28 సంవత్సరాల తర్వాత కలుసుకున్న విద్యార్థులంతా ఆటపాటలతో అలరించారు. ఒకరినొకరు పలకరించుకున్నారు. గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వానపల్లి గూడెం గుడ్ ఫర్డ్ ఉన్నత పాఠశాల 1996-97 పదో తరగతి విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 28సంవత్సరాల తర్వాత మిత్రులంతా ఒక చోట చేరడంతో ఆ నాటి మధుర స్మృతులను జ్ఞాపకాలను చేసుకున్నారు. రోజంతా ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా పలు రంగాలలో స్థిరపడిన విద్యార్థులు నాడు చదువుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొండాడ ఐజాక్ రాజేంద్ర, ఉపాధ్యాయులు విజయ మణమ్మ, మాకా ప్రసాద్‌రావు, జంధ్యాల సత్యనారాయణ, తోట శ్రీనివాసరావులను ఘనంగా సత్కరించారు. దోనేపూడి సురేష్, కలబత్తు మల్లేశ్వరరావు, పోలిశెట్టి కుమార్, పళ్ళ బాల బాలాజీ, ప్రేమకుమారి, బి.భవాని, వెంకట రమణ, కనక లక్ష్మి, జయలక్ష్మిలు ఆర్గనైజర్లుగా కార్యక్రమాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థులు హాజరై రానున్న రోజులలో సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగించాలని నిర్ణయించారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రతిష్ఠ

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక పాతూరులో లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు ఆలయ దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యంలో సీజీఎఫ్ నిధులు, దాతల సహకాంతో సుమారు రూకోటి 40లక్షలు కేటాయించారు. నేడు ఆలయ పనులు పూర్తి కావడంతో మూడు రోజుల పాటు పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి హరే రామ ప్రసాద్, ఆలయ కమిటీ నిర్వహకులు దూసనపూడి రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలలో భాగంగా ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షాదారణ, అకల్మష హోమం, సాయంత్రం యోగశాల ప్రవేశం, అంకుర్పారణ, వాస్తు హోమం, వాస్తుపూజ, ధ్వజారోహణ, గరుడహోమం, దిగ్దేవతా బలిహరణ, నీరాజనంలు జరిగాయి. 2వ తదీన విశేష పూజలు, 3వ తేదీ శనివారం శ్రీ లక్ష్మీనరసింహ, ద్వారపాలక పునఃప్రతిష్ఠ, స్వామి వారి శాంతి కళ్యాణం, ఆంజనేయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ, మధ్యాహ్నం భారీ అన్నసమారాధనలు నిర్వహిస్తారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం: వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని డీఎన్నార్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), అసిస్టెంట్ సెక్రటరీ ఆర్.రామకృష్ణరాజు అన్నారు. గురువారం డీఎన్నార్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బలుసుమూడి రోడ్డులో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కటికల పల్లారావు,పాకలపాటి సీతారామరాజు మాట్లాడుతూ తమ అసోసియేషన్ ఉచిత వైద్య శిబిరాలు, దాతల సహకారంతో గత రెండేళ్లుగా మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



అత్తిలిశాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు జీకేపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం.



పుస్తక ప్రదర్శన చేస్తున్న రిసోర్స్‌పర్సన్స్

అత్తిలి: అత్తిలి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం రిటైర్డు ఉపాధ్యాయుడు కె వెంకట్రావు విద్యార్థులకు జీకే, దేశ నాయకుల చరిత్ర తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందించే నిలయాలని, ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగ పర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, రిటైర్డు గ్రంథాలయాధికారి గంధం శేషవేంద్రరావు, ఉపాధ్యాయులు డేవిడ్‌రాజు, వి లక్ష్మణరావు, జి దొరబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే విజ్ఞానం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పుస్తక పఠనంతోనే విజ్ఞానమని, విద్యార్థినీ, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు రిసోర్స్‌పర్సన్స్ పేర్కొన్నారు. స్థానిక గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో గురువారం నాల్గవ రోజు వేసవి శిక్షణ శిబిరం జరిగింది. రిసోర్స్‌పర్సన్స్‌గా హాజరైన ప్రత్తి వీరాస్వామిచే పుస్తక సమీక్ష, కోపెళ్ళ శ్రీనివాసరావుచే లలిత కళలు, ఎ.జనార్ధనరావుచే నీతి కథలు, పొడుపు కథలు, ఆర్.నాగేంద్రకుమార్‌చే ఇంగ్లీషు, సీహెచ్ శ్రీదేవిచే లెక్కలు, జి.బాపయ్య శర్మచే ఇంగ్లీషు కథలు-అనువాదం తదితర ఇతర అంశాలను అవగాహన కల్పించారు. శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి పి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. విద్యార్థులు శిక్షణను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి



బల్లిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ ఆడుతున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

అత్తిలి: ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న మెరుగైన మౌలిక వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ నిధులు రూ.12.65 లక్షలతో నిర్మించిన కెమిస్ట్రీ ల్యాబ్‌ను, రూ. 3.90 లక్షలతో అభివృద్ధి చేసిన వాలీబాల్, షటిల్, కబడ్డీ, లాంగ్‌జంప్ కోర్టులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు కల్పించే దిశగా ప్రభుత్వం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తుందన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో లేని విధంగా కెమిస్ట్రీ ల్యాబ్‌ను ఈపాఠశాలలో ఏర్పాటు చేసుకోవడం ఎంతో సంతోషించదగిన విషయం అన్నారు. పాఠశాలలో సైకిల్ షెడ్డును ఏర్పాటు చేయాలని విద్యార్థిని కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి రాగా, షెడ్డును ఏర్పాటు చేస్తామని వారు హామీ ఇచ్చారు. ముందుగా గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ. 1.58 లక్షలతో నిర్మించిన మినీ గోకులం షెడ్డును కలెక్టర్ నాగరాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కసిరెడ్డి బాలాజీ, ఎంపీటీసీ సభ్యుడు ప్రగడ నాగేశ్వరరావు, ఎస్ఎస్ఏ ఏపీసీ శ్యాంసుందర్, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎన్ వేణుగోపాల్, స్థానిక నాయకులు గారపాటి బాబ్జి,గారపాటి ధర్మయ్య, ముత్యాల నాగేశ్వరరావు, విత్తంశెట్టిసత్తిబాబు, గారపాటి అశోక్, ఆచంట వెంకటరమణ, తోట గణేష్ పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతు గుండెల్లో గుబులు



వీరంపాలెం రహదారి పక్కన మొక్కజొన్న కంకులను ఆరబెట్టిన దృశ్యం



మొక్కజొన్న కంకులను మిషన్లకు ఎత్తుతున్న కూలీలు



కంకుల నుంచి గింజలను వేరు చేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: వాతావరణ మార్పులతో ఒక పక్క వరి రైతాంగంతో పాటు మరో పక్క మొక్కజొన్న రైతు గుండెల్లో గుబులు రేకెత్తుతుంది. ఇప్పటికే వరి కోతలు పూర్తి కావడంతో పాటు దాదాపు ధాన్యం మిల్లులకు తరలించారు. చెతాడేపల్లిగూడెం మండలంలో ఇంకా మిగిలి ఉన్న ధాన్యాన్ని రోడ్ల వెంబడి ఆరబెట్టి మిల్లులకు తరలించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. మరో పక్క మండలంలోని పట్టింపాలెం, వీరంపాలెం, గ్రామాల్లోని మొక్కజొన్న రైతాంగం ఆరబెట్టిన మొక్కజొన్న కంకుల నుంచి యంత్రాలతో గింజలను వలుస్తున్నారు.

నాలుగు టన్నుల దిగుబడి



మూడున్నర ఎకరాల పామాయిల్ తోటలో అంతర పంటగా మొక్కజొన్న వేశాను. ఎకరానికి మూడున్నర నుంచి నాలుగు టన్నుల వరకు దిగుబడి వస్తుందని అంచనా. దీని ప్రకారం 80 నుంచి లక్ష రూపాయల వరకు ధర లభిస్తుంది. మొక్కజొన్నను ఆడించి కోళ్లఫారాలకు మేతగా తరలించేందుకు ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. గత రెండ్రోజులుగా ఆకాశం మేఘావృతం కావడంతో ఇబ్బిడి చేసుకుంటున్నాం.

– మేకా రామయ్య, కౌలు రైతు, పట్టింపాలెం, తాడేపల్లిగూడెం మండలం

వైఎస్సార్ సీపీ మండల కమిటీల నియామకం

తణుకు అర్బన్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తణుకు నియోజకవర్గంలోని అత్తిలి, ఇరగవరం మండలాల పార్టీ కమిటీల నియామకాలను గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. అత్తిలి మండల పార్టీ కమిటీ ఉపాధ్యక్షుడిగా బొడ్డేటి మురళికృష్ణ, బలిజేపల్లి రామభాస్కరరావు, ప్రధాన కార్యదర్శులు కటికరెడ్డి నరసింహరాజు, భీమవరపు నాగేశ్వరరావు, నల్లిమిల్లి శ్రీనివాసరెడ్డి, నేలపాటి సుబ్బయ్య, కార్యదర్శులు మద్దా ఇస్రాయేల్, పెచ్చెట్టి రాము, బందెల వెంకటరావు, ఖండవల్లి రవికుమార్, ములగపాటి సూర్యనారాయణరాజు, కార్యనిర్వాహక సభ్యులు సాలా కుమారస్వామి, సుంకర పాండురంగారావు, అన్నూరి నాగ సత్యనారాయణ, ఈడూరు సూరయ్య, కోడే సుబ్బారావు, నల్లమిల్లి గౌరీశంకరరెడ్డి, దిరిశాల నాగబాబు, కాకర్ల వెంకట సుబ్బయ్య, బండి సత్యనారాయణ, వెలగపల్లి శ్రీను, సాధనాల రమేష్, బొంతు ఆంజనేయులు, తాటిపర్తి సుజాతలను నియమించారు.

ఇరగవరం మండల నియామకాలు..

ఇరగవరం మండల పార్టీ కమిటీ ఉపాధ్యక్షుడిగా జాలే సుబ్బారావు, జవ్వాది రామోజీ, ప్రధాన కార్యదర్శులుగా మార్లపూడి దాసు, సత్తి సత్తిబాబు, గరికిపాటి సతీష్, పాలా పాలేశ్వరరావు, కార్యదర్శులు గుడిమెట్ల వీర్రెడ్డి, తాతపూడి బరుసుబాబు, పోతురెడ్డి మాధవరావు, గుడ్డ నాగేశ్వరరావు, వాసంశెట్టి సింహాచలం, కార్యనిర్వాహక సభ్యులు నరాలశెట్టి కృష్ణ వెంకట రామప్రసాద్, దొంగ శ్రీను, చోడే ఏసురత్నం, వీరవల్లి సత్యనారాయణ, చేబ్రోలు పెద్దిరాజు, జుత్తిగ కిషోర్, సైపురెడ్డి పెద్దిరాజు, మరమూడి పుష్కరుడు, వీరమల్లు గణపతి, గంధం దానయ్య, పిల్లి రాంబాబు, జక్కంశెట్టి ఏడుకొండలు, మెరుపే నాగేశ్వరరావు, పి.పెద్దస్వామి, కర్రి నాగిరెడ్డి, కర్రి వీరారెడ్డి నియమితులయ్యారు.